విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామికి సాష్టాంగ నమస్కారం చేస్తున్న సీఎం కేసీఆర్, శోభ దంపతులు, అమ్మవారి పూజలో స్వరూపానందేంద్ర స్వామి, సీఎం కేసీఆర్ దంపతులు

కేసీఆర్ రాజశ్యామల యాగం

- తెలుగు రాష్ట్రాల సర్వతో ముఖాభివృద్ధిని కాంక్షిస్తూ ఎర్రవెల్లిలో ప్రారంభం
- మూడు రోజులపాటు రాజశ్యామల సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగం
- కేసీఆర్ దంపతులతో యాగసంకల్పం చేయించిన స్వరూపానందేంద్ర

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రత్యేక యాగాన్ని తలపెట్టారు. విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్రస్వామి, స్వాత్మానందేంద్రస్వామి ఆధ్వర్యంలో బుధవారం యాగానికి అంకురార్పణ జరిగింది. ఎర్రవల్లిలోని సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో మూడురోజులపాటు యాగం కొనసాగనున్నది. రాజశ్యామల సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగంగా దీనికి నామకరణం చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన 170 మంది పండితుల ఆధ్వర్యంలో ఈ యాగం నిర్వహిస్తున్నారు. ఉదయం గోపూజ అనంతరం కేసీఆర్ దంపతులు యాగశాల ప్రవేశం చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసనతో యాగానికి అంకురార్పణ జరిగింది. కేసీఆర్ దంపతులు పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామికి సాష్టాంగ నమస్కారం చేసి యాగంలో ఆసీనులయ్యారు. గురు ఆజ్ఞ తీసుకుని యాగాన్ని ప్రారంభించారు. కేసీఆర్ దంపతులతో స్వరూపానందేంద్రస్వామి యాగ సంకల్పం చెప్పించారు. విశాఖ శ్రీశారదా పీఠ అధిష్ఠాన దైవం రాజశ్యామల అమ్మవారికి స్వరూపానందేంద్రస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశ్యామల అమ్మవారిని వనదుర్గ అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. యాగం నిర్విఘ్నంగా కొనసాగాలని ముక్కోటి దేవతలను ప్రార్థిస్తూ.. అస్త్ర రాజార్చన, కర్కరీయ స్థాపన నిర్వహించారు. యాగంలో పాల్గొనే పండితులు, రుత్విక్కులకు కేసీఆర్ దంపతులు దీక్షా వస్త్రాలను స్వయంగా అందజేశారు. అఖండ స్థాపన అనంతరం అగ్నిమథనం చేసి యాగశాలలో అగ్నిని ప్రతిష్ఠించారు. యాగంలో రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి వేణుగోపాలాచారి, ప్రభుత్వ సలహాదారు అనురాగ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి కోసమే కేసీఆర్ యాగం: స్వరూపానందేంద్ర

రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రాజశ్యామల యాగం చేపట్టారని, రాజులతోపాటు సామాన్యులను అనుగ్రహించే అమ్మవారు రాజశ్యామల అని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామి తెలిపారు. రుద్ర, చండీ, వనదుర్గ హోమాలు అన్నిచోట్లా జరుగుతాయని, రాజశ్యామల యాగం విశిష్టమైనదని యాగం ప్రాధాన్యం వివరించారు. రాజులతో పాటు సామాన్యులను అనుగ్రహించే రాజశ్యామల యాగం కఠినమైన బీజాక్షరాలతో కూడినదని చెప్పారు. మహాశక్తివంతమైన రాజశ్యామల యాగ ఫలితం సీఎం కేసీఆర్ కుటుంబానికే కాదని, యావత్ రాష్ట్రానికీ ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలమైందన్నా, హైదరాబాద్ మహానగరంగా అభివృద్ధిచెంది వెలుగొందుతున్నదన్నా అది గతంలో సీఎం కేసీఆర్ చేసిన రాజశ్యామల యాగం ఫలితమేనని తెలిపారు. మహాభారతం చదివిన జ్ఞాని కేసీఆర్ అని అభివర్ణించారు. ముఖ్యమంత్రులు ఎందరో తనకు తెలిసినా హైందవతత్వం పరిపూర్ణంగా తెలిసిన నేత కేసీఆర్ మాత్రమేనని కొనియాడారు. బ్రాహ్మణుల సంక్షేమాన్ని కోరుకున్న కేసీఆర్ కుటుంబానికి రాజశ్యామలాదేవి అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని ఆకాంక్షించారు. శ్రీశారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు కొలువై ఉన్న ఏకైక పీఠం విశాఖ శ్రీశారదా పీఠమేనని స్పష్టం చేశారు.

శత చండీయాగం నిర్వహించిన సీఎం కేసీఆర్

లోక కల్యాణార్థం సీఎం కేసీఆర్ దంపతులు బుధవారం తమ వ్యవసాయక్షేత్రంలో శతచండీ యాగం నిర్వహించారు. శత చండీ యాగంలో భాగంగా.. గురు, దేవతా ప్రార్థన, మహాసంకల్పం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, ఆచార్యాది రుత్విగ్వరణము, యాగశాల సంస్కారం, గోపూజ, సహస్ర మోదక గణపతి హోమం, ఆదిత్యాది నవగ్రహ హోమం, నవాక్షరీ మూల మంత్ర జప అనుష్ఠానం, రాహు బృహస్పతి సంధి శాంతి, త్రైలోక్య మోహన గౌరీ హోమం, అఘోరాస్త్ర హోమ కార్యాలు, చండీ సప్తశతి పారాయణం, చతుర్వేద పారాయణం, మహా మంగళ హారతి, మంత్రపుష్పం, అష్టావధాన-సేవ తదితర కార్యక్రమాలను సీఎం కేసీఆర్ దంపతుల చేతులమీదుగా వేద పండితులు నిర్వహించారు.

దేశ రైతన్నకు కేసీఆర్ అవసరం

- వేల్పూర్‌లో అఖిల భారత రైతుల వెల్లడి
- ఓట్ల కోసమే కాంగ్రెస్ గ్యారంటీలు
- మేము నమ్మి మోసపోయాం.. మీరు మోసపోకండి
- తెలంగాణ ప్రజలకు, అన్నదాతలకు కర్ణాటక రైతుల పిలుపు
- కేసీఆర్ గెలిస్తే రైతు గెలిచినట్టే: మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, నవంబర్ 1: రైతు పక్షపాతి కేసీఆర్ లాంటి నాయకుడు దేశానికి అవసరమని యూపీ, మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానా, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన రైతులు పేర్కొన్నారు. దేశ రైతాంగానికి భరోసా కేసీఆర్ అని, తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో బుధవారం అఖిల భారత రైతు సంఘాల నాయకుల సమావేశం జరిగింది. కోటపాటి నర్సింహనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితోపాటు మహారాష్ట్ర శేత్కారి సంఘటన్‌కు చెందిన రఘునాథ్ దాదా పాటిల్, యూపీ క్రిషి భూమి బచావో మోర్చా ప్రతినిధి రాఘవేంద్ర కుమార్, హర్యానా బీకేయూ తరపున సేవా సింగ్ ఆర్యా, తమిళ్ వ్యవసాయ సంఘం ప్రతినిధి కేఎం రామగౌండర్, ఫార్మర్స్ అసోసియేషన్ ఆఫ్ కర్ణాటకకు చెందిన పరశురాం లక్ష్మణ్‌తోపాటు పలు రాష్ట్రాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. తెలంగాణ రైతు పథకాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు.

కేసీఆర్‌తోనే కిసాన్ సర్కార్

అనంతరం కర్ణాటక రైతు సంఘం నాయకుడు పరశురాం లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసమే గ్యారంటీలు ప్రకటిస్తున్నదని, కర్ణాటకలో తాము నమ్మి మోసపోయామని, తెలంగాణ ప్రజలు కూడా మోసపోవద్దని చెప్పారు. వ్యవసాయానికి 5 గంటల కరెంట్ మాత్రమే ఇస్తున్నారని, అది కూడా అర్ధరాత్రి ఇస్తున్నారని, కర్ణాటకలో ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇస్తూ రైతులను కంటికి రెప్పలా చూసుకుంటున్నారని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మోటార్లకు మీటర్లు పెట్టారని, కరెంట్ బిల్లులు కడుతున్నామని యూపీ రైతులు వాపోయారు. తాము ఏడాదికి సాగునీటి పన్ను 12 వేలు కడుతామని, కానీ ఇక్కడ కేసీఆర్ రైతులకే 10 వేలు ఇస్తున్నారని కొనియాడారు. రైతు కోసం కేసీఆర్‌లా ఆలోచించే నాయకుడు దేశంలోనే ఎవరూ లేరని శేత్కారి సంఘటన్ నాయకులు రఘునాథ్ ప్రశంసించారు. రానున్న రోజుల్లో అన్ని రాష్ట్రాల రైతులం కలిసి ప్రధానిని చేస్తామని ప్రకటించారు. అబ్‌కి బార్ కిసాన్ సర్కార్ అని నినదించిన ఏకైక రాజకీయ నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. అనంతరం మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్‌ను కాదనుకుంటే తినే పల్లెంలో మన్ను పోసుకున్నట్టేనని అన్నారు. కాంగ్రెస్ చెప్తున్న గ్యారెంటీలన్నీ బూటకమని, ఓట్ల కోసమే వాళ్లు డ్రామాలాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతుల గోసలు అన్నీ ఇన్నీ కావని చెప్పారు. కేసీఆర్ లాంటి రైతు పక్షపాతి నాయకుడిని కాపాడుకోవటానికి వాళ్లు ఇక్కడికి వచ్చి రైతులను చైతన్యం చేస్తున్నారని వివరించారు. రైతుల బాగు కోరే కేసీఆర్ లాంటి నాయకుడికి మద్దతుగా నిలువాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ గెలిస్తే రైతు గెలిచినట్టేనని పేర్కొన్నారు.

బుధవారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో అఖిల భారత రైతుల సమావేశంలో పొరుగు రాష్ట్ర రైతుతో మాట్లాడిస్తున్న మంత్రి వేముల

యశ్వంత్‌రావు కేల్కర్ అవార్డుకు దరఖాస్తులు

హైదరాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : విద్యారంగం, సేవ, పర్యావరణ రంగాల్లో అత్యుత్తమ సేవలందించిన యువకులకు అందజేసే ప్రొఫెసర్ యశ్వంత్‌రావు కేల్కర్ యువ పురస్కారానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి యాజ్ఞవల్క్య శుక్లా, రాష్ట్ర కార్యదర్శి చింతకాయల రూన్సీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 7 నుంచి 10 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ మహాసభల్లో అవార్డును అందజేస్తామని పేర్కొన్నారు. అవార్డు కింద ఎంపికైన వారికి రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేస్తామని తెలిపారు. వివరాలకు ఏబీవీపీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణను ఎండబెట్టిన వారికి అవకాశమివ్వాలా?

- మీడియాతో ఎక్సైజ్, క్రీడల శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, నవంబర్ 1: హంద్రినీవా, పోతిరెడ్డిపాడు, ఆర్టీఎస్ నుంచి అక్రమంగా నీటిని తరలించి తెలంగాణను ఎండెట్టిన వారికి మరోసారి అవకాశమివ్వాలా అని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నిలదీశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను తిడితే నాయకులవుతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌తో కలిసి బుధవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కుటుంబ పాలనపై రాహుల్‌గాంధీ మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని, ఆయన రాజకీయాల్లోకి ఎలా వచ్చారో చరిత్ర తెలుసుకోవాలని హితవు పలికారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ.. ఇలా ఒక కుటుంబం కాదా అని ప్రశ్నించారు. రాత్రి, పగలు తేడా లేకుండా స్వరాష్ట్రం కోసం శ్రమించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యులు రాజకీయల్లో ఉంటే తప్పేముందని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఢిల్లీలో ఉంటే.. తమ నాయకుడు, ప్రగతి ప్రదాత ముఖ్యమంత్రి కేసీఆర్ గల్లీలో ఉన్నాడనే విషయాన్ని గమనించాలని సూచించారు. రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్న రాహుల్‌గాంధీకి ఇక్కడ జరిగే విషయాలేలా తెలుస్తాయని విమర్శించారు. రూ.లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్లకు పైగా అవినీతి జరిగిందని మాట్లాడుతున్న రాహుల్‌ను చూస్తే జాలి కలుగుతున్నదని ఎద్దేవా చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రాహుల్ గాంధీ జోడో యాత్ర ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఉన్నదే ప్రజలు, నాయకులను మోసం చేసేందుకని తెలిపారు. రాష్ట్రంలో బీసీలు బలంగా ఉన్న చోట టికెట్లు లేకుండా చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. ఎక్కడైతే ఓడిపోతారో అక్కడ మాత్రమే బీసీలకు సీట్లు ఇస్తున్నదంటూ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వంటి నాయకులు ఉన్నంత వరకు బజారులో కూరగాయల్లాగా టికెట్లు అమ్ముకుంటుందని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేశ్, ముడా చైర్మన్ వెంకన్న, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరినవారికి గులాబీ కండువా కప్పుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్